క్లుప్తంగా

సొంత నిధులతో బియ్యం పంపిణీ



బియ్యం అందజేస్తున్న వెంకటేశ్వర్లు

రాంబిల్లి: కొత్తపట్నంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చోడిపిల్లి వెంకటేశ్వర్లు తన సొంత నిధులతో రేషన్‌కార్డుకు 10 కేజీల చొప్పున బియ్యం అందజేశారు. తన తండ్రి చోడిపిల్లి గావోడు జ్ఞాపకార్థం వెంకటేశ్వర్లు 800 మందికి పదేసి కేజీల చొప్పున బియ్యం అందజేశారు. దీంతో పలువురు వెంకటేశ్వర్లును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జి.శిరీష శ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, కొత్తపట్నం, వాడనర్సాపురం సర్పంచ్‌లు చోడిపిల్లి పార్వతి, కారె రామారావు పాల్గొన్నారు.

పేదలకు సర్పంచ్ వితరణ



నిరుపేదలకు దుప్పట్లు అందజేస్తున్న మునగపాక సర్పంచ్ అప్పారావు సోదరులు

మునగపాక : సంక్రాంతి పర్వదిన సందర్భంగా తన తల్లి దిమ్మల అచ్చియమ్మ జ్ఞాపకార్థం మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు ఆదివారం నిరుపేదలకు దుప్పట్లు అందజేశారు. ఏటా సంక్రాంతి పర్వదిన సందర్భంగా అప్పారావు అతని సోదరుడు నూకరాజు సొంత నిధులతో సమాకూర్చిన దుప్పట్లను సాయిబాబా ఆలయంలో పేదలకు అందజేశారు. ఇటువంటి సేవా కార్యక్రమాన్ని తలపెట్టిన సర్పంచ్ అప్పారావు సోదరులను పలువురు అభినందించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



దిమిలి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

రాంబిల్లి : పదేళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా కలుసుకున్నారు. 2002–2003 టెన్త్ బ్యాచ్ దిమిలి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు సోమవారం తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి చిలిపి చేష్టలు, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా కలిసి భోజనం చేసి ఆనందంగా గడిపారు.

కోడిపందాలపై పోలీసుల కొరడా



పి.ఎల్.గ్రామంలో రాత్రి నిఘా పెట్టిన సీఐ అప్పలరాజు

పాయకరావుపేట : సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలో కోడి పందాలు నిర్వహించకుండా స్థానిక సీఐ పి.అప్పలరాజు గట్టి చర్యలు తీసుకున్నారు. మండలంలో గల పి.ఎల్.పురం, గోపాలపట్నం, కుమారపురం, వెంకటనగరం తదితర గ్రామాల్లో కోడిపందాలు ఆడకుండా సీఐ పి.అప్పలరాజు రాత్రి, పగలు గ్రామాల్లో తిరిగి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కోడిపందాలు, పేకాటలు, గుండాటలు నిర్వహించకుండా చర్యలు తీసుకున్నారు.

సేవాభావంతో మానసిక తృప్తి



దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి: సేవాభావంతో మానసిక తృప్తి కలుగుతుందని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. రాంబిల్లిలో ఆదివారం ఆయన 1000 మంది పేదలకు దుప్పట్లు అందజేశారు. తన బావ దివంగత సత్యంరాజు జ్ఞాపకార్థం దుప్పట్లు అందజేశారు. ఏటా పేదలకు వస్త్రదానం చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

- మొదలయిన తీర్థాల సందడి
- పలు ప్రాంతాల్లో తోడపెద్దు సంబరాలు



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం



తోడపెద్దు సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం



ఎస్.రాయవరంలో తీర్థంలో కోలాహలం

నక్కపల్లి: సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకొన్నారు. సంక్రాంతి సందర్భంగా పిండివంటల ఘుమఘుమలు, కొత్తబట్టలు ధరించిన చిన్నారులు, యువత, కుర్రకారు ఆటపాటలతో మునిగి తేలారు. సినీమాహాళ్లు కూడా ప్రేక్షకులతో రద్దీగా మారాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరాధ్య దైవంగా కొలిచే తోడపెద్దుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా కోడి పందాలు కూడాపెద్ద ఎత్తున జరిగాయి. హరిదాసులు, గంగిరెద్దుల వారి సందడి గ్రామాల్లో ఈ రెండు రోజులు బాగానే ఉంది. ఇక గ్రామంలో పేకాట కార్యక్రమాలు జోరుగా సాగాయి. పండగ ప్రయాణికులతో ఆర్‌టీసీ కాంప్లెక్స్‌లు, రైల్వేస్టేషన్లు, బస్సులు రద్దీగా ఉన్నాయి.

మొదలయిన తీర్థాల సందడి

సంక్రాంతి సమయంలో ముఖ్యంగా చెప్పుకునేది.. తీర్థాలు(తిరునాళ్లు). సంక్రాంతి మొదలుకుని 15రోజుల పాటు పలు చోట్ల తిరునాళ్లు పెద్ద ఎత్తున జరుగుతాయి. ముఖ్యంగా నక్కపల్లి, ఒడ్డిమెట్ట, నామవరం, గొడిచర్ల, చినదొడ్డిగల్లు తదితర ప్రాంతాల్లో తిరునాళ్లు ప్రతి ఏటా ఘనంగా జరుగుతాయి. తిరునాళ్ల సందర్భంగా తోడపెద్దు భజనలు, తప్పెట గుళ్లు, కోలాటాలు, జరిగాయి. కనుమ నాడు ఒడ్డిమెట్ట, ఉపమాకలో జరిగిన తిరునాళ్లకు వేలాది మంది హాజరయ్యారు. పలు గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

కోటవురట్ల : పల్లెల్లో సంక్రాంతి సంబరాలు వైభవంగా సాగుతున్నాయి. మండలంలో సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా జరుపుకొన్నారు. పలు గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు కనుల పండువలా జరుగుతున్నాయి. సమీప గ్రామాల నుంచి వచ్చిన జనాలతో సందడిగా మారుతున్నాయి. పాత తంగేడు గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని రామాలయం వద్ద తీర్థ మహోత్సవం నిర్వహించారు. రామాలయంలో దీపారాధన చేశారు. రంగవల్లికల పోటీ నిర్వహించారు. లింగాపురంలో కనుమ పండుగ సందర్భంగా తీర్థ మహోత్సం నిర్వహించారు. రంగవల్లికల పోటీ నిర్వహించి విజేతలకు ఎస్ఐ నారాయణ రావు చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొరుప్రోలు రమణ, రుత్తల గోవిందు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలో సంక్రాంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలో తీర్థ మహోత్సవం ఏర్పాటు చేసి సందడి చేశారు. చిన్నారులు తీర్థంలో ఆట వస్తువులు కొనుగోలు చేసి , రంగుల రాట్నాలు ఎక్కి ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం కనుమ పండగ కూడా వేడుకగా జరుపుకొన్నారు. రైతులు పాడి పశువులను, పశుశాలలను శుద్ధి చేసి కనుమ వేడుకలు నిర్వహించారు. ఇంటివద్ద వండిన పిండి వంటలు పశువులకు సహితం ప్రసాదాలుగా సమర్పించారు. యంత్రాలకు, వాహనాలకు ఆయుధ పూజలు నిర్వహించారు.

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో తీర్థ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కట్టుబోలులో బాలసన్యాసమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా ఆదివారం దిమిలిలో సంతోషిమాత అమ్మవారు, లోవపాలెంలో పరశురామన్న తీర్థ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తప్పెటగుళ్లు, కోలాటాలు, తోడపెద్దు సేవ, నేలవేషాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. దిమిలిలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, ఎంపీపీ జి. శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైస్ ఎంపీపీ కొటాపు లక్ష్మీవడ్డికాసులు, సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ పాల్గొన్నారు.



ఉపమాకలో జరిగిన తిరునాళ్లు

పాటిపల్లిలో పలువురికి సత్కారం

మునగపాక: సంక్రాంతి పండగ సందర్భంగా పాటిపల్లిలో స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దలకు సన్మానం నిర్వహించారు. సచివాలయ ఏఎన్ఎం సుజాతను ఘనంగా సత్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జ్యూట్ బ్యాగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆడారి మోహనరావు, సర్పంచ్ ఆడారి కృష్ణవేణి, ఎస్.తమ్మిరాజు, కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు. నాగులాపల్లిలో మళ్ల రామునాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మళ్ల అప్పలనాయుడు జ్ఞాపకార్థం వారి కుమారులు మళ్ల కాలేశ్వరరావు నేతృత్వంలో 250 మంది పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మళ్ల ఆదినారాయణ మూర్తి, ఉమామహేశ్వరరావు, దివాకర్,అప్పలనాయుడు, శ్రీను పాల్గొన్నారు.

వేడుకగా ముగ్గుల పోటీలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం సంక్రాంతి పర్వదినాన అందిరి ఇళ్లలో పెద్దలకు బట్టలు పెట్టారు. పలు గ్రామాల్లో ఆదివారం, సోమవారం తీర్థాలు నిర్వహించారు.సంక్రాంతి రోజున జగ్గన్నపేటలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

రెజ్లింగ్ స్టార్ యూత్, స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అచ్యుతాపురం, మడుతూరు, దోసూరు, హరిపాలెం, జగన్నాథపురం , పూడిమడక వంటి పలు గ్రామాల్లో పండగను ఘనంగా నిర్వహించారు. ఇళ్ల ముందు రంగవల్లులు, చిన్నారుల గాలి పటాల ఆటలతో ఇళ్లన్నీ ఉత్సాహంగా కనిపించాయి.



జగ్గన్నపేటలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



దిమిలిలో సంతోషిమాత తీర్థ మహోత్సవంలో కోలాటం



పాటిపల్లి సచివాలయ ఏఎన్ఎం సుజాతను సత్కరిస్తున్న దృశ్యం

కోడిపందాలు, పేకాట శిబిరాలపై పోలీసుల దాడి



దార్లపూడిలో పట్టుబడిన పందెం రాయుళ్లు



పెదఉప్పలంగ్రామంలో పేకాట శిబిరంలో పట్టుబడిన జూదరులు

ఎస్.రాయవరం : మండలంలో సంక్రాంతి వేడుకలు పురస్కరించుకుని కోడిపందాలు బరులు, పేకాట శిబిరాలు విచ్చల విడిగా వెలిసాయి. గుట్టు చప్పుడు కాకుండా గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న బరులపై ఎస్ఐ ప్రసాద్‌రావు తన సిబ్బందితో నిఘా పెంచారు. మూడు కోడిపందాలాటలపై, నాలుగు పేకాట శిబిరాలు పై దాడులు నిర్వహించి పలువురిని అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్ఐ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.రాయవరంలో కోడి పందాల్లో ఐదు గురు వ్యక్తులు 12 కోళ్లు, రూ. 3500 నగదు స్వాధీన పరచుకోగా దార్లపూడి ఇరువురు వ్యక్తులు 7 కోళ్లు, రూ. 1500 నగదు, వమ్మవరంలో నలుగురు వ్యక్తుల వద్ద 7 కోళ్లు, రూ.600 నగదు స్వాధీన పరచుకుని కేసులు నమోదు చేశామన్నారు. పేకాట శిబిరాల్లో కొరుప్రోలులో ఇద్దరు వ్యక్తులు, రూ.7200 నగదు, పెదఉప్పలంలో ఆరుగురు వ్యక్తులు ,రూ 12320 నగదు, సైతారుపేటలో ఐదు గురు వ్యక్తులు రూ.2210 నగదు , పెదగుమ్ములూరులో ముగ్గురు వ్యక్తులు రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

జూదరులపై పోలీసులు దాడులు

నక్కపల్లి : మండలంలో సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న జూదాలపై ఎస్ఐ శిరీష ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. 18 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.26,200 నగదు, 10 కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. డీఎల్‌పురం, వేంపాడు, సారిపల్లిపాలెం, రమణయ్యపేట, సీహెచ్ఎల్‌పురం, రేబాక,చినదొడ్డిగల్లు గ్రామాల్లో పేకాటలు, కోడిపందాలు, గుండాట వంటి జూదాలు నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. ఎస్ఐ శిరీష తమ సిబ్బందితో దాడి చేసి, పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

విద్యాభివృద్ధికి సూర్యనారాయణ ఎనలేని కృషి



విశ్రాంత ఉపాధ్యాయుడు సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : విద్యాభివృద్ధికి విశ్రాంత ఉపాధ్యాయులు వెలగా సూర్యనారాయణ ఎంతో కృషి చేశారని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కొనియాడారు. సోమవారం మునగపాకలో సూర్యనారాయణ పొలాల వద్ద ఏర్పాటు చేసిన సంతాపసభలో ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత సూర్యనారాయణకే దక్కుతుందన్నారు. గోనాలమ్మ సంఘ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉత్సవకమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,సూర్యనారాయణ కుమారులు నరసింగరావు,జగన్నాథరావు, వెంకటేష్, సురేష్‌కుమార్‌తో పాటు గోనాలమ్మ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రామగిరి తీర్థం



రామగిరి సీతారాముల సన్నిధిలో గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్ తదితరులు

మునగపాక : మండలంలోని రామగిరి గ్రామంలో సీతారాముల తీర్థ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు సీతారాములను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఏటా కనుమ పండుగ నాడు తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఏడాది కూడా కొండపై ఉన్న సీతారాములను దర్శించుకునేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, వైస్ ఎంపీపీ బోజా లక్ష్మీ శ్రీనివాసరావు, పక్కుర్తి బాబూరావు, పల్లా రాజు, పెంటకోట హరేరామ, దాసరి అప్పారావు, బుజ్జి సీతారాములను దర్శించుకున్నారు.

ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ కొనసాగించాలి

ఎస్.రాయవరం : ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ కొనసాగించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్‌రావు పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు వినతి పత్రం అందజేశారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద వివిధ దళిత సంఘాల పెద్దలతో వచ్చి ఎమ్మెల్యే కలిశారు. 2013 తీసుకు వచ్చిన చట్టం, 2023 తో ముగిస్తోందని, దానిని కొనసాగించేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులపై ఆడిట్ చేయించాలన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ కాని ఎస్సీ సబ్ ప్లాన్ అమలుకు దళిత సంఘాల ఎన్జీవోలు కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏఎంఎస్ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణ్ రావు, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న దళిత సంఘ నాయకులు

ఘనంగా సోమేశ్వరస్వామి తీర్థ మహోత్సవాలు



పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న ఎడ్లబళ్లు

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో సోమలింగపాలెం గ్రామంలో జిల్లా స్థాయి ఎడ్లబండి పోటీలు ఘనంగా జరిగాయి. సంక్రాంతి పర్వదినం–కనుమ పండగ సందర్భంగా సోమేశ్వర స్వామి తీర్థమహోత్సవం పురస్కరించుకుని గ్రామంలో జరిగిన ఈ జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పోటీలలో 9 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఈ పోటీలు స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ కర్రి శివ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో చోడవరం మండలానికి చెందిన నర్సాపురం జట్టు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకోగా, నీలకంఠాపురం తృతీయ బహుమతి మరియు మెట్టపాలెం గ్రామం జట్టు నాలుగో బహుమతులు గెలుచుకున్నాయి. ఈ పోటీలకు ఆర్థిక సహాయం మాజీ కౌన్సిలర్ యల్లపు గోపి వైఎస్సార్‌సీపీ నాయకులు యల్లపు త్రినాథ్, కర్రి నాయుడు, బొడ్డేడ శ్రీను, కర్రి స్వామి, గౌరి యూత్ తదితరులు అందించారు.

పూలపల్లకీలో అయ్యప్ప ఊరేగింపు



అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మునగపాక : మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహ ఊరేగింపు ఆదివారం ఘనంగా జరిగింది. మకర సంక్రాంతి పర్వదిన సందర్భంగా అయ్యప్ప ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో అన్ని వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ప్రత్యేకంగా తయారు చేసిన పూల పల్లకిలో అయ్యప్పస్వామిని మేళతాళాలతో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ముగ్గుల పోటీల విజేతకు బహుమతులు అందజేస్తున్న లా కళాశాల కరస్పాండెంట్ వెంకటరావు

మునగపాక : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని షిరిడీసాయి లా కళాశాల కరస్పాండెంట్ పెంటకోట వెంకటరావు కోరారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం మునగపాక నందీశ్వర తులసీ కళావేదిక ప్రాంగణంలో ప్రవాస మిత్ర ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆయన అదే రోజు రాత్రి బహుమతులు అందజేశారు. నిర్వాహకులు వెలగా నరసింగరావు, పెంటకోట వెంకట్, గిరిబాబు, మళ్ల జోగారావు, దొడ్డి శ్రీహరిప్రియ, భరణి, పెంటకోట జగ్గు, ఆడారి సూర్యచంద్రరావు, ఆడారి రమణబాబు, సూరిశెట్టి సుధారాణి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి గుర్రపు పరుగు పోటీలకు విశేష స్పందన



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాన్‌జిమ్ అధినేతలు విజయ్,అజయ్

మునగపాక : కనుమ పండుగ సందర్భంగా మునగపాకలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి గుర్రపు పరుగు పోటీలకు విశేష స్పందన కనిపించింది. గ్రామానికి చెందిన విల్లూరి పద్మారావు,మహేష్‌ల జ్ఞాపకార్థం మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన గుర్రాల పరుగు పోటీల్లో విజేతలకు డాన్‌జిమ్ అధినేతలు పెంటకోట విజయ్, అజయ్ సోదరులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రామన్నపాలేనికి చెందిన చోడమాంబిక గుర్రం ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. ఆర్ఆర్ పేటకు చెందిన దాడి కోటేశ్వరరావు, దేవరాపల్లికి చెందిన సాయి, రామన్నపాలెంకు చెందిన ధర్మిరెడ్డి అప్పారావుల గుర్రాలు ద్వితీయ, తృతీయ, చతుర్ధ బహుమతులు అందుకున్నాయి. కార్యక్రమంలో ఆడారి రాజు, శరగడం జగన్, బొడ్డేడ ప్రసాద్,దాడి నాయుడు,సాయి పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం



ఉరుసు ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాబూరావు



బోదిగల్లంలో మసీదును అలంకరించిన దృశ్యం



మసీదు వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

ఎస్.రాయవరం : ముస్లింలు కలిసికట్టుగా వారి మత ఆచార కట్టుబాట్లతో ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆనందదాయకంగా ఉందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పెదుగుమ్ములూరు శివారు సీతారామ్‌పురం గ్రామంలో సోమవారం ఉరుసు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే చందల్ ఊరేగింపు కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, యేజర్ల సీతారామరాజు, చింతలపాటి మణిరాజు, నరసింహమూర్తి ఖాదర్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలో ముస్లింలు హజరత్‌ఖాదర్ వల్లీ ఉరుసు ఉత్సవం పండగను ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. పెదబోదిగల్లం, పెద దొడ్డిగల్లు రామకృష్ణాపురం, అప్పలపాయకరావుపేట, చినబోదిగల్లం తదితర గ్రామాల్లో మసీదులను సర్వాంగ సుందరంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. ముస్లింలంతా ఒక చోట చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుర్రంపై బావుటాలు ఎగరవేశారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ తదితరులు ముస్లింలకు ఉరుసు ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు నిత్యావసర సరకుల వితరణ



కైలాసపట్నంలో సరకులు అందిస్తున్న జెడ్పీటీసీ ఉమాదేవి, నాయకులు

కోటవురట్ల: విశాఖకు చెందిన లలితా ప్లాస్టిక్స్ అధినేత శాంతిలాల్ పుగారియా గత కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా కోటవురట్ల మండలంలో ప్రతి ఏటా పలు కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందిస్తున్నారు. సంక్రాంతి పండగను సందర్భంగా ఆదివారం కైలాసపట్నం, కోటవురట్ల గ్రామాలకు చెందిన 25 మంది పేదలకు జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి చేతుల మీదుగా సరుకులు అందించారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో పంచదార, కిలో కందిపప్పు, కిలో వంట నూనె, కూరగాయలు చొప్పును పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని చాటాలన్నారు. పేదలకు సాయం అందించడంలో ఉన్న సంతృప్తి వర్ణించలేనిది అన్నారు. కార్యక్రమంలో శాంతిలాల్ పుగారియా, మాజీ సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, తుమ్మలపల్లి ఆంజనేయులు, పెన్నాడ రాంబాబు, అనపర్తి వరహాలు, బత్తుల సతీష్, తుమ్మలపల్లి బాబూరావు, మేడిశెట్టి నానాజీ, భజన నాని పాల్గొన్నారు.